క్లుప్తంగా

నేడు నీటి సరఫరాకు అంతరాయం

గాజువాక: స్థానిక సుందరయ్య కాలనీలోని 10 ఎంజీడీ మంచినీటి శుద్ధి కర్మాగారంలో ఫిల్టర్ బెడ్‌లు, క్లారిఫ్లోక్యులేటర్, సంపులను గురువారం శుభ్రపరచడంతో పాటు చిన్నచిన్న మరమ్మతులు నిర్వహించనున్నట్టు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సహాయ ఇంజనీరు పి.కేదార్‌నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా 70, 71, 72, 73, 74, 76, 64, 65 వార్డులకు గురువారం నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


విద్యార్థులు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్

అగనంపూడి: చదువులు, ఆటల్లో రాణించాలంటే బాల్యం నుంచే పౌష్టికాహారం తీసుకోవాలని గాజువాక ప్రైవేటు పాఠశాలల(జిప్సా) అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు అన్నారు. 87వ వార్డు కూర్మన్నపాలెంలోని రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్టాల్స్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రుచులతో పాటు మనం తీసుకొనే ఆహారంలో పోషకవిలువ ఉండాలన్నారు. పాఠశాల డైరెక్టర్ పొన్నాడ వాసుదేవరావు, ప్రిన్సిపల్ లలిత కుమారి మాట్లాడుతూ సీజనల్‌గా లభ్యమయ్యే పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకవిలువలు దొరుకుతాయన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న మహిళా ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం సత్యసాయి సేవ, ఆధ్యాత్మిక మందిరంలో టౌన్ అడ్మినిస్ట్రేషన్ పబ్లిక్ హెల్త్ విభాగానికి చెందిన మహిళా పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామంలో కొలువై ఉన్న సాయిబాబాకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించారు.

వైభవంగా పగల్‌పత్తు ఉత్సవాలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు రెండవరోజు బుధవారం వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శోభాయమానంగా అలంకరించి బంగారుఛాయ పల్లకీలో కొలువుంచారు. తెల్లవారుజాము 5గంటల నుంచి ఆలయ బేడామండపంలో విశేషంగా తిరువీధి నిర్వహించారు. శోడషోపచార పూజలు జరిపారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవికి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు.

ఇక సందడే.. సందడి

విశాఖ మహా నగరానికి ముఖద్వారం గాజువాక. భారీ పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు, రవాణా రంగం, భారీ విద్యా సంస్థలతో మహా పట్నంగా ఎదిగింది. పారిశ్రామిక నగరంగా ప్రపంచ పటంలో చోటు దక్కించుకుంది. అయినా గాజువాకలో ఇప్పటికీ గ్రామీణ వాతావరణం ఉట్టిపడుతోంది. పల్లె సంస్కృతులు, సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి. అనేక గ్రామాల్లో గ్రామదేవతల పండగలు, వివిధ సంబరాలు, కళారూపాలతో సందడి నెలకొంటుంది.

- గాజువాక

గాజువాక పట్నంలో పల్లె సంబరాలు

కొత్త ఏడాది నుంచి కోలాహలం మొదలు

సంక్రాంతి తర్వాత పరసలు ఆరంభం


గాజువాక పట్నం

కొత్త సంవత్సరం ఆరంభంతోనే గాజువాక ప్రాంతంలో సందడి మొదలైంది. షాపింగ్‌లతో మార్కెట్లు.. దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి నుంచి పరసల సందడి మొదలవుతుంది. నియోజకవర్గంలో గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇక్కడ నెలరోజులపాటు పరసలు కనువిందు చేస్తాయి. ఈ సందర్భంగా ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత అందాన్ని తెస్తాయి.

45 గ్రామాల్లో

గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో విస్తరించిన నియోజకవర్గంలో దాదాపు 45 గ్రామాలున్నాయి. గాజువాకలోని పురాతన గ్రామాలైన జోగవానిపాలెం, అజీమాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలైన చినగంట్యాడ, చట్టివానిపాలెం, మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, తోకాడ, యారాడ, కొత్తదిబ్బపాలెంలో పూర్తిగా పల్లె వాతావరణం కనిపిస్తుంది. వీటితోపాటు స్టీల్‌ప్లాంట్ పునరావాస కాలనీలు కూడా స్థానిక గ్రామాలే. గతంలో గ్రామాలుగా ఉన్న పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ, గంగవరం, యాతపాలెం గ్రామాలు ప్రస్తుతం పునరావాస కాలనీలుగా అభివృద్ధి చెందాయి. ఈ ఐదు పునరావాస కాలనీల్లోను సుమారు 64 గ్రామాలకు చెందిన నివాసులు స్థానికులే. ఉపాధి నిమిత్తం ఈ ప్రాంతానికి లక్షల మంది వలసలు వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ స్థానిక గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సంక్రాంతి అనంతరం ఈ గ్రామాల్లో పరసల హడావుడి మొదలవుతుంది.

కళాకారులకు పండగే

గ్రామదేవతల పండగలు, పరసలు నిర్వహించే రోజుల్లో కళాకారులకు మంచి అవకాశాలు లభిస్తాయి. సాంప్రదాయ కళలైన భజనలు, సాము గరిడీలు, తోడపెద్దుల ప్రదర్శన, తప్పెటగుళ్లు, కోలాటాలు, చిడతలతోపాటు స్థానికంగా ఉండే కళాకారుల ప్రదర్శనలు ఆద్యంతం ఉత్సాహాన్ని నింపుతాయి. ఇతర ప్రాంతాల నుంచి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సంగీత విభావరి కార్యక్రమాలు, సాంఘిక నాటకాలు, పౌరాణిక డ్రామాలు, కోయ డ్యాన్సులు, డూప్స్ బాబోయ్ డూప్స్, బుర్రకథ తదితర కార్యక్రమాలు కనువిందు చేస్తాయి. కళాకారులకు ఆర్థికంగా మద్దతు కూడా లభిస్తుంది. భారీ విద్యుత్ అలంకరణలతో ఆయా గ్రామాల్లోని రోడ్లు ధగధగలాడతాయి.


గాజువాకలోని పరసలో కళారూపాలు (ఫైల్)

గ్రామదేవతల పండగలతో కనువిందు

గ్రామదేవతల పండగలను అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ తర్వాత ఈ పండగలు ప్రారంభమై దాదాపు రెండు, మూడు నెలలపాటు కొనసాగుతాయి. తమ గ్రామాల్లో నిర్వహించుకొనే ఈ పండగలకు దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులను సైతం ఆహ్వానించి సంతోషాన్ని పంచుకుంటారు. గాజువాకలో కుంచుమాంబ అమ్మవారి పండగను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆ కోవలోనే నాతయ్యపాలెంలో బంగారమ్మ పండగ, పెదగంట్యాడలో పెంటమాంబ ఉత్సవం, గంగవరం గ్రామంలో పెద్దమ్మోరు పండగ, పాతకర్ణవానిపాలెం పైడితల్లమ్మ, దుర్గమ్మ పండగలతోపాటు చినగంట్యాడలో కుంచుమాంబ, వడ్లపూడి, అగనంపూడి పునరావాస కాలనీల్లో వివిధ గ్రామదేవతల పండగలను ఘనంగా నిర్వహిస్తారు.


గాజువాక గ్రామదేవత కుంచుమాంబ

ఇక పరసల కోలాహలం

నూతన సంవత్సరంతో మొదలయ్యే సందడి సంక్రాంతి తర్వాత వచ్చే పరసలతో కోలాహలంగా ఉంటుంది. గ్రామాల్లో పరసలు, తిరునాళ్ల పేరుతో ఉత్సవాలను నిర్వహిస్తూ గ్రామీణ సాంప్రదాయాలను కొనసాగిస్తారు. గాజువాక ప్రాంతానికి చెందిన పలు గ్రామాలతోపాటు వివిధ పరిశ్రమలకు చెందిన పునరావాస కాలనీల్లోనూ పరసలు ఘనంగా కొనసాగుతాయి. పరసల సందర్భంగా వివిధ ఆటల పోటీలను నిర్వహించి వేదికలపై విజేతలకు బహుమతులు అందజేస్తారు.


పరసలో ప్రదర్శిస్తున్న కళారూపం (ఫైల్)

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలి


స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మెయిన్ గేటు వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ యాజమాన్యం నాలుగు నెలలుగా ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. యాజమాన్యం వెంటనే పెండింగ్ ఉన్న 285 శాతం జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, బి.ఎన్. రాజు, సుబ్బయ్య, కారు రమణ, రమణమూర్తి, అవతారం, మద్ది అప్పలరాజురెడ్డి, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


పండ్ల అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రధానార్చకులు భావనారాయణస్వామి, అర్చకులు హరినారాయణ స్వామి నేతృత్వంలో స్వామిని వివిధ ఫలాలతో అలంకరించారు. అంతకు ముందు వేకువజామున 4 గంటలకు స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, మంగళాశాసనాలు నిర్వహించారు. ఉక్కునగరం వాసులు పెద్ద సంఖ్యలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


మాజీమంత్రి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు


వేడుకల్లో మాట్లాడుతున్న రేవతీ దేవి


టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


సంబరాల్లో భెల్ ఉద్యోగుల కుటుంబాలు

పెదగంట్యాడ: కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితం ఆనందమయం కావాలని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నూతన సంవత్సర వేడుకలను స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, గొందేశి మహేశ్వరరెడ్డి,మంత్రి శంకరనారాయణ, సంపంగి ఈశ్వరరావు పాల్గొన్నారు.

- పత్రీజీ పిరమిడ్ స్పిర్చువల్ కేంద్రంలో ట్రస్ట్ ప్రతినిధి మీసాల శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రేవతీ దేవి, పల్లా కార్తీక్, వనిత, అప్పలరాజు, నీలకంఠం పాల్గొన్నారు.
- జీవీఎంసీ 72వ వార్డు సమతా నగర్ సామాజిక భవనంలో రోటరీ క్లబ్, సమతా నగర్ యోగ ఆధ్వర్యంలో కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. 72వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్‌గౌడ్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో విక్టర్ రాజు, మన్మథరావు పాల్గొన్నారు.

అగనంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డిలను గాజువాక మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు ఆధ్వర్యంలో నాయకులు మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్యతో పాటు తిప్పల దేవన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: నూతన సంవత్సర వేడుకలను భెల్ భెల్(హెచ్‌పీవీపీ)లో ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. చిన్నారు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది, రాంనగర్, తుంగ్లాం, శీలానగర్, హరిజనజగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందు రంగవల్లులతో మహిళలు సందడి చేశారు.

అమ్మో.. భెల్ సిగ్నల్!

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. గాజువైపు వెళ్లే మార్గంలో సిగ్నల్ వద్ద రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరో వైపు రడీమిక్స్ లారీ డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల మెటీరియల్ జారిపడుతోంది. అవి రోడ్డు మీద ఉండడంతో వాహనాలు అదుపు తప్పి క్షతగాత్రులవుతున్నారు. అధికారులు ఈ రెండు అంశాలపై చర్యలు తీసుకుని ప్రమాదాలను అరికట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.


శీలానగర్ నుంచి గాజువాక వైపు వెళ్లే మార్గంలో సిగ్నల్ వద్ద గోతులు


భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద రోడ్డుపై కాంక్రీట్

ధనుర్మాసం.. ఆధ్యాత్మిక వైభవం

అక్కిరెడ్డిపాలెం: వెంకన్న ఆలయాలు ధనుర్మాస పూజలతో శోభిల్లుతున్నాయి. ప్రత్యేక పూజలతో నూతన శోభ సంతరించుకున్నాయి. జీవీఎంసీ 68వ వార్డులోని భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల దేవదాయ శాఖ నిర్వహణలోని వేంకటేశ్వర స్వామి, వినాయక స్వామి వార్ల దేవాలయం, 69వ వార్డు శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రం రోజురోజుకూ భక్తుల తాకిడితో శోభాయమానంగా విరాజిల్లుతున్నాయి.

ప్రసన్న వేంకటేశ్వరాలయం విశిష్టత

భెల్ సిగ్నల్ పాయింట్ వద్దగల ప్రసన్న వేంకటేశ్వరాలయం విశాఖ నగరంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న ఆలయం. బీహెచ్‌పీవీ ఉద్యోగులు ఆ ప్రాంతంలోని ప్రసన్న గిరి ప్రసన్న వేంకటేశ్వరుడిని చినజీయర్ స్వామితో ప్రతిష్ఠింపజేశారు. అదే కొండపై బాల వినాయక స్వామి , దాసాంజనేయ స్వామి ఆలయాలను కూడా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రసన్న వేంకటేశ్వరుడు కోరిన కోరికలు తీర్చే స్వామిగా పేరు ప్రఖ్యాతలు పొందారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా 2002లో ఆలయాలను దేవదాయ శాఖ తమ ఆధీనంలో తీసుకుంది. ప్రతీ ఏటా ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహిస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తుతారు.

దివ్య వైభవం

శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం అనతి కాలంలోనే ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి సామాన్య రోజుల్లో కూడా భక్తులు పోటెత్తుతున్నారు. తిరుమల బాలాజీ దివ్య క్షేత్రాన్ని ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ స్థాపించారు. అప్పటి నుంచి శీలానగర్‌కు ఆధ్యాత్మిక శోభ వచ్చింది. దివ్యక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులదే అగ్రస్థానం. ప్రతి శనివారం ఆలయంలో భక్తులకు అన్నదానం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నారు. ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహిస్తున్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం


శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుడు


భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న వేంకటేశ్వర ఆలయ ప్రవేశమార్గం

ప్రశాంతంగా ఉంటుంది



శీలానగర్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశుని దర్శనంతో ఎంతో ఆనందంగా ఉంటుంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న మాదిరిగానే ఆలయ ప్రవేశంతోనే అనుభూతి పొందుతాం. ఆలయంలో భక్తులకు నిత్యం ప్రసాద వితరణ చేయడం విశేషం.

- నంబారు రాజు, అక్కిరెడ్డిపాలెం

చిన్న తిరుపతిగా భావిస్తాం



భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయం అంటే చిన్న తిరుపతిగా భావిస్తాం. గాజువాకతో విశాఖ, అనకాపల్లి ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. కోరిక కోరికలు తీర్చే ప్రసన్న వేంకటేశ్వరునికి దేశ విదేశాల్లో భక్తులు ఉన్నారు. ఆలయం ప్రసన్న గిరిపై ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటుంది.

- జనార్దన్, రాంనగర్

మురుగుతో అవస్థలు


మింది విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సమీపంలోని మింది విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు వాహనచోదకులకు అసౌకర్యానికి గురిచేస్తోంది.సర్వీసు రోడ్డు పక్కనున్న కల్వర్టులో మురుగు తొలగించి రోడ్డుపైనే డంప్ చేశారు. దీంతో సర్వీసు రోడ్డుపై రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారు. కాలువ నుంచి మురుగు తీసిన వెంటనే వాహనంలో వేసి తరలించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, పీఠం ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 72వ వార్డు పరిధిలోని వుడా కాలనీ వినాయకనగర్‌లో గల నవ్య చేతన్ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవ్య చేతన్ మహిళా సంఘం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అండిబోయిన అప్పారావు, వనుము నాగేశ్వరరావు, వెంపాడ అప్పారావు, చప్పిడి నాగరాజు, మల్లెల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: అగనంపూడికి చెందిన భవన నిర్మాణ కార్మికుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను బొర్రమాంబ ఆలయ ఆవరణలో విష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సాయిన అప్పారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను ఆదుకోడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

విజయదుర్గా పీఠం క్యాలెండర్ ఆవిష్కరణ

ఉక్కునగరం: స్టీల్ టౌన్‌షిప్ సెక్టార్-6లోని శివాలయంలో బుధవారం విజయదుర్గా పీఠం క్యాలెండర్ ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ భరత్ కుమార్ విజయదుర్గా పీఠం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి భక్తులు పాల్గొన్నారు.